సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 21 । జూన్ । 2023



సంగీతమే శ్వాసగా..

నేడు ప్రపంచ సంగీత దినోత్సవం. సిక్కోలు యువత సంగీతంపై మక్కువ చూపుతున్నారు.

- 8లో



దాతలే దిక్కు

డిగ్రీ విద్యార్థి అనారోగ్యంతో మంచం పట్టాడు. చికిత్స కోసం దాతల సాయం అవసరమవుతోంది.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	36°	26°
ఇచ్ఛాపురం	35°	25°
పాతపట్నం	35°	25°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

'పెండింగ్ దరఖాస్తులు పరిశీలించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్ అప్లికేషన్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు విధుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌పై పది కంటే ఎక్కువగా ఓటర్లు నమోదై ఉంటే వాటిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. అదే విధంగా వందేళ్లు నిండిన ఎలక్ట్రోలర్స్‌పై రీ వెరిఫికేషన్ చేయాలని, యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ఆర్డీవో బి.శాంతి టెక్కలి డీఆర్‌ఓ సీతారాం శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి ఓటర్ల వెరిఫికేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూలై 1 నుంచి ఓటర్ల జాబితా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాను తనిఖీ చేస్తారని తెలిపారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో అధికారులు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ పి. మురళీ కృష్ణ, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, రాజకీయ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, టీడీపీ ప్రతినిధి పీఎంజె బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు తదితరులు హాజరయ్యారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'



విద్యార్థులకు బోధిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో డార్మిటరీ, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణతార, దుప్పలవలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.దేవేందర్, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24న జెడ్పీ సర్వసభ్య సమావేశం



ఆర్.వెంకట్రామన్ జెడ్పీ సీఈఓ

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటల ఉంచి స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ తెలియజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులంతా హాజరుకానున్నారని, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులంతా పూర్తి శాఖల సమగ్ర సమాచార నివేదికలతో హాజరు కావాలని కోరారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన 38 మంది జెడ్పీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, ఎంపీపీలు కూడా ఈ సమావేశానికి హాజరై జిల్లా ప్రగతికి సూచనలను అందించాలని తెలిపారు.

జయహో జగన్నాథ

బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి గుడి బయటకు వచ్చారు. తన కోసం సిద్ధం చేసిన రథమెక్కి భక్తులను ఆశీర్వదించారు. జగన్నాథ రథయాత్ర జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగింది. శ్రీకాకుళం, టెక్కలి, పలాస, మందస, ఇచ్ఛాపురం తదితర చోట్ల స్వామి యాత్రా క్రతువును వైభవంగా నిర్వహించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గలో శోభాయమానంగా జగన్నాథ రథయాత్ర (ఇన్‌సెట్లో) శ్రీకాకుళం బొందిలీపురంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

ఒత్తిడిపై యోగాస్త్రం



ఆసనాలు ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి. ఒంటిని వింటిలా వంచి చేస్తున్న విన్యాసాలు ఆయుష్షును పెంచుతున్నాయి. శ్వాసపై నిలకడైన ధ్యాస, ఆలోచనలపై స్పష్టమైన అదుపు, ఆరోగ్యంపై శ్రద్ధ.. కలగలిపి యోగా. కోవిడ్ ఆపత్కాలం తర్వాత ఆరోగ్యంపై అందరికీ శ్రద్ధ పెరిగింది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా యోగా సహకరిస్తుండడంతో సిక్కోలులో లెక్కకు మిక్కిలి యోగా శిక్షణ కేంద్రాలు వెలిశాయి. బీఆర్‌ఏయూలోనూ ప్రత్యేక కోర్సు నిర్వహిస్తున్నారు. ఒత్తిడిపై యోగాస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం.

- అందుబాటులో యోగా కోర్సులు
- ఊరూరా యోగా శిక్షణ కేంద్రాలు

శ్రీకాకుళం కల్చరల్, ఎల్ఎన్ పేట, ఇచ్ఛాపురం: సిక్కోలు యోగా నేర్చుకుంటోంది. ఆరోగ్యంపై అందరికీ శ్రద్ధ పెరగడంతో కసరత్తు చేసే వారితో పాటు ఆసనాలు వేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇందుకు అనుగుణంగా ఊరూరా యోగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. యోగాతో పాటు ధ్యానం కూడా అందరికీ అలవాటవుతోంది. సాధారణంగా యోగా ఒక్కసారి చేసి వదిలేసి కాదు. అదొక నిరంతర ప్రక్రియగా సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. యోగాతో జీవన శైలిలో మార్పులు వస్తాయని చెబుతున్నారు.

జిల్లా కేంద్రంలో..

జిల్లావ్యాప్తంగా వందలాది యోగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఒక్క శ్రీకాకుళం చుట్టపక్కలే దాదాపు 30 కేంద్రాల్లో ఉచితంగా యోగా నేర్పిస్తున్నారు. ఇందులో కూడా అధికంగా యోగా చార్య రామారావు, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. నేరుగా క్లాసులు తీసుకోవడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారు.



యోగా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కరోనా సమయంలో ప్రారంభమైన క్లాసులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

డిప్లమా, పీజీ కోర్సులు

అంబేడ్కర్ యూనివర్సిటీలోనూ యోగాకు ప్రత్యేక కోర్సులు ఉన్నాయి. ఏయూ సహకారంతో సర్టిఫికెట్, పీజీ డిప్లమా కోర్సులు ప్రారంభించారు. యోగా సర్టిఫికెట్ కోర్సు మూడు నెలలు కాగా, పీజీ డిప్లమా కోర్సు 12 నెలలు ఉంటుంది. వీరికి పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు కూడా ఇస్తున్నారు. ఇప్పటికి 450 మంది ఇక్కడ కోర్సుల్లో చేరారు.

మంచి ఆరోగ్యానికి యోగా



మనిషి నేటి సమాజంలో నిత్యం ఒత్తిడికి గురవుతున్నారు. దీని వల్ల లేనిపోని రోగాలు వస్తున్నాయి. యోగా నేర్చుకోవడం వల్ల శరీరంలోని ప్రతి అవయవానికి కదలిక ఏర్పడి కొత్త శక్తి వస్తుంది.
- ఎంవీ రామారావు, యోగాచార్య, శ్రీకాకుళం

యోగా నేర్పిస్తున్నాం..



గత 20 ఏళ్లుగా యోగా తరగతులు నిర్వహిస్తున్నాం. ఎంతో మంది ఒత్తిడి నుంచి విముక్తులవుతున్నారు. ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నాం. మంచి స్పందన వస్తోంది.
- నాగేశ్వరరావు, యోగా గురువు

కోవిడ్ సమయంలోనూ..



కోవిడ్ సమయంలో కూడా తక్కువ మందితో యోగా క్లాసులు నిర్వహించారు. ఏయూలో ఆ సమయంలో ఎవరూ చేరలేదు. పీజీ చేసే వారికి రెండు సెమిస్టర్లు, ఒక ప్రాక్టికల్ ఉంటుంది. పరీక్షలో 4 థియరీ పేపర్లు, ఒక ప్రాక్టికల్, ఏడాది కోర్సు, డిప్లమో చేసేవారికి ఆరుమాసాలు కోర్సు 3 థియరీ పేపర్లు, ఒక ప్రాక్టికల్ ఉంటుంది. ఇప్పటి వరకు 450 మంది నేర్చుకొని అర్హత ధ్రువీకరణ పత్రాలు పొందారు.
- డాక్టర్ కె.తారకరామారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

రోజంతా ఉల్లాసం



ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కొంత సమయం యోగా చేయటం వల్ల ఆ రోజంతా ఉల్లాసంగా ఉంటారు. అన్ని వయసుల వారు యోగా చేయవచ్చు. విద్యార్థులు యోగా చేయటం వల్ల చదువుల్లో చురుగ్గా ఉంటారు. జ్ఞాపక శక్తి పెరుగుతుంది. - పిల్లా రమణమ్మ, పీడీ టీచర్, జెడ్పీహెచ్ స్కూల్, రాపాక, పొందూరు మండలం

ఉపయోగాలు..



అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు శ్రీకాంత్ మహంతి విన్యాసం

- **అర్ధరాజ కపోతాసనం:** నడుం నొప్పి తగ్గిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగుపర్చుతుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది.
- **శీర్షాసనం:** ఇది మెదడులో రసాయనాలను పెంచుతుంది. దీంతో మెదడు ఉత్తేజంగా పనిచేస్తుంది. జుత్తురాలే సమస్య అరికడుతుంది.
- **పశ్చిమోత్తనాసనం:** దీని సాధన ద్వారా శరీరంలో పొట్ట చుట్టూ పెరిగిన కొవ్వును తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.
- **నత్తగుల్లఆసనం:** దీని ద్వారా వెన్నెముక సామర్థ్యం పెరుగుతుంది. రక్తప్రసరణ సవ్యంగా జరుగుతుంది. రక్తశుద్ధికి దోహదపడుతుంది. గొంతు సంబందిత వ్యాధులకు దూరం కావచ్చు.
- **హాలాసనం:** వెన్నెముక సమస్యల నుంచి కాపాడుతుంది. థైరాయిడ్ గ్రంథులను ఉత్తేజపరుస్తుంది. ఖుదోషాన్ని హరిస్తుంది.
- **సర్వాంగాసనం:** ఇది నడుం నొప్పిని తగ్గిస్తుంది. రక్త ప్రసరణ జరగ డానికి దోహదం చేస్తుంది. ముఖ వర్చస్సు పెరుగుతుంది.



- **వృక్షాసనం:** ఇది ఏకాగ్రతను పెంచుతుంది. మనసుకు ప్రశాంతత సమకూర్చుతుంది. రోగ నిరోధక శక్తి పెరగడానికి దోహదపడుతుంది.



- **ఉష్ట్రాసనం:** ఇది మెడ నొప్పిని తగ్గిస్తుంది. కిడ్నీల్లో ఏర్పడిన రాళ్లను కరిగించటానికి దోహదపడుతుంది.



- **చక్రాసనం:** ఇది జీర్ణాశయం పనితీరును మెరుగుపర్చు తుంది. థైరాయిడ్ గ్రంథులను ఉత్తేజ పరుస్తుంది.



- **వజ్రాసనం:** మధుమేహం (సుగర్) సమస్య నుంచి కాపాడుకోవచ్చు. శరీరంలో గ్లూకోజ్ స్థాయిని నిరోధిస్తుంది.

ప్రతిభకు ప్రశంస

టెన్త్, ఇంటర్‌లలో చక్కటి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ విద్యార్థులకు సర్కారు మర్చిపోలేని కానుక అందించింది. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విజయవాడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులను సత్కరించారు.







సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఇంటర్ టాపర్లు ఎ.అమృత, కె.లహరి, కె.మీనాకుమారి.







కమ్యూనిటీ సర్వీస్ అవార్డు అందుకుంటున్న యు.రేష్మ



సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న టెన్త్ టాపర్లు జి.నిఖిత, యు.జాహ్నవి, మిట్టు మహాపాత్రో

'యోగా దినోత్సవంలో పాల్గొనండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అంతా పాల్గొనాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక ఆరోగ్యం, జ్ఞాపక శక్తి, మానసిక ప్రశాంతత చేకూరుతాయన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా శిక్షణ కేంద్రాల వారు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

బడుల్లో యోగా డే

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యోగాసనాలు వేసే కార్యక్రమం నిర్వహించాలని డీఈఓ తిరుమల చైతన్య స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రార్థన ముగిసిన అనంతరం ఒక గంటపాట విద్యార్థులతో యోగాసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను వివరించాలన్నారు.

స్వల్పంగా పెరిగిన ఆదిత్యుని భూముల ఆదాయం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్య క్షేత్రానికి చెందిన వ్యవసాయ భూముల సేద్యపు హక్కుల కోసం మంగళవారం పలు ప్రాంతాల్లో బహిరంగ వేలం కార్యక్రమం జరిగింది. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అరసవల్లి, వాడాడ, వప్పంగి, రాయిపాడు, చింతాడ (పాలకొండ)లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గతంలో కంటే కొంతమేరకు ఆదాయం పెరిగేలా పాటలు ఖరారయ్యాయి. దేవదాయ శాఖ ప్రత్యేక బృందంతో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అరసవల్లి, వాడాడ, వప్పంగి, రాయిపాడు, చింతాడ తదితర గ్రామాల్లో మొత్తంగా 26.55 ఎకరాల వ్యవసాయ భూమిని 2023–24 నుంచి 2025–26 వరకు మూడేళ్ల పాటు సేద్యపు హక్కులను ఇచ్చేందుకు వీలుగా హిందూ రైతులకు వేలం పాట నిర్వహించారు.

స్వల్పంగా పెరిగిన ఆదాయం



భూ సేద్యపు హక్కుల వేలంను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్

ఆలయానికి చెందిన 26.55 ఎకరాల భూములకు మూడేళ్ల సేద్యపు హక్కులను ఇచ్చేందుకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఏడాదికి రూ.2,07,200 చొప్పున ఆలయానికి ఆదాయం లభించినట్టైంది. అరసవల్లిలో 1.10 ఎకరాల భూమికి రూ.15,500, వప్పంగిలో ఉన్న 21.60 ఎకరాల్లో భాగంగా 3.54 ఎకరాల భూమికి రూ.30,700, అలాగే 2.37 ఎకరాల భూమికి రూ.19 వేలు, 1.38 ఎకరాలకు రూ.13 వేలు, 5.32 ఎకరాలకు రూ.8 వేలు, 8.99 ఎకరాల భూమికి రూ.91 వేలు చొప్పున, వాడాడ గ్రామ పరిసరాల్లో ఉన్న 1.25 ఎకరాల భూమికి రూ.6 వేలు, రాయపాడులోని 2 ఎకరాలకు రూ.20 వేలు, చింతాడ (పాలకొండ సమీపంలో) గ్రామ పరిసరాల్లో 0.60 సెంట్ల భూమికి రూ.4 వేలకు వేలం పాట ఖరారయ్యాయి. వేలం పాట ఖరారైన కౌలుదారులు కేవలం మూడేళ్ల పాటు సేద్యం చేసుకునేందుకు మాత్రమే అర్హులని, నిబంధనల ప్రకారం ఏ పరిస్థితుల్లోనైనా ఆలయ అవసరాల మేరకు భూములను తిరిగి తీసుకుని లీజును రద్దు చేసే అధికారం తమకుందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ స్పష్టం చేశారు. ఈయన వెంట ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ టి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీసెట్‌లో నిఖితకు7వ ర్యాంకు


నిఖిత

నరసన్నపేట: మండలంలో జమ్ము గ్రామానికి చెందిన చల్ల నిఖిత ఏపీ డీఈఈ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. డిప్లమా ఎడ్యుకేషన్ ఎంట్రన్స్ పరీక్షలో గణిత విభాగంలో 65 మార్కులతో ఈమె ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు నిఖితను అభినందించారు.

సజావుగా ఈసెట్


శివానీ కాలేజీలో హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ రెండో ఏడాది ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈసెట్–2023 ప్రవేశ పరీక్ష మంగళవారం జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించారు. పాలిటెక్నిక్ డిప్లమో, డిగ్రీ ఎంపీసీ స్ట్రీం పూర్తి చేసి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. చిలకపాలెం శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 189 మందికి 181 మంది, రెండో షిఫ్టులో 189 మందికి 183 మంది, ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 185 మందికి 181 మంది, రెండో షిఫ్టులో 186 మందికి 180 మంది, టెక్కలి ఐతంలో మొదటి షిఫ్టులో 130 మందికి 126 మంది, రెండో షిఫ్టులో 130 మందికి 129 మంది హాజరయ్యారు.

కూర్మనాథుని సన్నిధిలో ఉడిపి పీఠాధిపతి


కూర్మనాథాలయంలో విశ్వావల్లభ తీర్థ స్వామీజీ

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని ఉడిపికి చెందిన షోదే శ్రీవాది రాజమఠం పీఠాధిపతి విశ్వావల్లభ తీర్థ స్వామీజీ శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం విచ్చేసిన స్వామీజీకి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మూల విరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు. ఆయన వెంట జబర్దస్త్ ఫేం హరికృష్ణ ఉన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

జి.సిగడాం: జిల్లా వ్యాప్తింగా రేషన్ డిపోల డీలర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రేషన్ డిపోల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి రవి కుమార్ కోరారు. మంగళవారం జి.సిగడాం–పొందూరు మండలాలకు చెందిన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 23న విజయవాడ వెళ్లి అక్కడ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి డీలర్ల సమస్యను వివరిస్తామన్నారు. మండలాల్లో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సరుకులను తూకం వేయకుండా డిపోలకు బియ్యం పంపిణీ చేస్తున్నారని, ప్రతి 50 కేజీల బస్తాలో సుమారు అరకేజీ తక్కువ వస్తుందని చెప్పారు. ఇటువంటి వాటికి చెక్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు చిట్టి రామ్మూర్తి, సత్తిబాబు, జిల్లా కార్యదర్శి బి.భాస్కరరావు, డివిజనల్ అధ్యక్షుడు గంగు శిమ్మినాయుడు, పొందూరు మండల శాఖ అధ్యక్షుడు సింహచలం, జి.సిగడాం మండల శాఖ అధ్యక్షుడు నక్క రవికుమార్, చిత్తిరి మోహన్, ఆసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000–00
బంగారం(22సి. 10గ్రా.)	55,500–00
వెండి (కిలో)	78,600–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ.554.00
శ్రీకాకుళం	రూ.554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

సంగీతమే శ్వాసగా..!

- సంగీత సాధనపై సిక్కోలు యువత ఆసక్తి
- పట్టుదలతో సాధన చేస్తూ.. పట్టు సాధిస్తున్న వైనం
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం


సంగీతం నేర్చుకుంటున్న యువత

శ్రీకాకుళం కల్చరల్ :

విశ్వవ్యాప్త లలిత కళ సంగీతం. సంగీతం నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయి. మనసు ఉల్లాసంగా మారి, చేస్తున్న పనిపై ధ్యాస పెరిగేందుకు దోహదపడుతుంది. అందుకే నేటి యువత సంగీతం నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతోంది. తల్లిదండ్రులు సైతం ముందుకు వస్తూ పిల్లలకు సంగీతం నేర్పిస్తున్నారు. వాయిద్య పరికరాలతో వేదికలెక్కి ప్రదర్శనలు ఇస్తూ దాన్నే తమ వృత్తిగా ఎంచుకున్నవారు కూడా ఉంటున్నారు. నేడు ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు సంగీతకారులపై ప్రత్యేక కథనం..

అనురాగ నిలయంలో..


అనురాగనిలయంలో సంగీత సాధన

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అనాథ చిన్నారుల కోసం నిర్వహిస్తున్న అనురాగ నిలయంలో చిన్నారులకు రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత సంగీతంగా నేర్పించారు. అక్కడి చిన్నారులు వేదికపై ప్రదర్శనలు కూడా ఇచ్చే స్థాయికి చేరుకున్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారులకు సంగీతం నేర్పించడం ద్వారా కొంత సాంత్వన చేకూర్చడం ఆనందంగా ఉందని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు చెబుతున్నారు.

బెంగళూరులో ఫ్యాకల్టీగా సునీల్..

జిల్లాలోని కత్తెరవీధిలో నివాసముంటున్న ఎం.వి.కామేశ్వరరావు కుమారుడు సునీల్. తల్లి లక్ష్మీ ప్రోత్సాహంతో సంగీత క్లాసులకు వెళ్లి మక్కువ పెంచుకున్నారు. బీటెక్ వరకు చదివినా సంగీతమే ఊపిరిగా ఎంచుకొని దానిపైనే తన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. 2005 నుంచి పెంకి నాగేశ్వరరావు గురువుగా కీబోర్డు నేర్చుకున్నారు. నాగరాజు, ధామస్‌ల వద్ద శిష్యరికం చేసి మరింత ప్రావీణ్యత సంపాదించారు. పూర్తిస్థాయి మ్యూజీషియన్‌గా మారడమే తన లక్ష్యమని సునీల్ తెలిపారు. ఈయన ప్రస్తుతం బెంగళూరులోని త్రిషన్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్‌లో ఫ్యాకల్టీగా ఉంటూ అక్కడి తోటి సిబ్బందికి అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నారు


కీబోర్డు ప్రదర్శన చేస్తున్న ఎం.సునీల్

వృత్తి వైద్యం.. ప్రవృత్తి సంగీతం

నగరంలోని విశాఖ ఎ–కాలనీకి చెందిన చిట్టి తిరుమలరావు, సరస్వతి దంపతుల కుమారుడు డాక్టర్ చిట్టి రామకృష్ణ. ఓ వైపు వైద్యంలో రాణిస్తూనే మరో వైపు ప్రవృత్తిగా సంగీతంలో బిజీగా ఉంటున్నారు. సంగీతంలో వోకల్, వీణలను నుసరాపు లక్ష్మీగణపతి శర్మ వద్ద, డి.శ్రీనివాస్‌ల వద్ద నేర్చుకొని విజయనగరం సంగీత కళాశాలలో సర్టిఫికెటు కోర్సు పూర్తి చేశారు. కెనడా, మలేషియా, బెంగళూరులో ఉంటున్న వారికి ఆన్‌లైన్‌లో సంగీత క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇతని సతీమణి శ్రీసౌమ్య కూడా రేడియేషన్ అంకాలజిస్టుగా జెమ్స్ ఆసుపత్రిలో పని చేస్తున్నారు. ఆదిత్యా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్‌లో మిస్టర్ లోనీ సినిమాకు వీణ ప్రదర్శన చేశారు. ఆల్ ఇండియా రేడియో ఏ–గ్రేడ్ ఆర్టిస్టుగా నమోదయ్యారు. ఎస్‌వీబీసీ ఛానెల్‌లో కూడా వీణ ప్రదర్శన ఇచ్చారు. శాస్త్రీయ సంగీతం, పాశ్చాత్య సంగీతం కలగలిపిన ఫ్యూషన్ ప్రదర్శన కూడా 2012లో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్‌లో మ్యూజిక్ పోటీలలో ప్రథమ బహుమతి పొందారు. వీణ ప్రదర్శనలో పీజీ డిప్లమో చేయాలనే ఆశయంతో ఉన్నారు. వీణ ప్రదర్శన తనకు ఎంతో హాయినిస్తుందని రామకృష్ణ అన్నారు. ఈయన ప్రస్తుతం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో నేత్రవైద్యునిగా పనిచేస్తున్నారు.


వీణపై ప్రదర్శన ఇస్తున్న డాక్టర్ రామకృష్ణ

ఒకే ఇంట్లో నలుగు కళాకారులు

ఆమదాలవలసకు చెందిన బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి హరికథకులు కాగా ఆయన ముగ్గురు కుమారులు కూడా సంగీతమే ప్రపంచంగా జీవనం సాగిస్తున్నారు. మొదటి కుమారుడు దుర్గా శ్రీనివాసశర్మ మృదంగంలో ఐదుసార్లు జాతీయ అవార్డు అందుకొని అనేక కచేరీలు నిర్వహించారు. శ్రీకచ్ఛపీ కళాక్షేత్రం స్థాపించి ఎందరో మేటి యువ కళాకారులకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం ఐఐఐటీలో మృదంగ అధ్యాపకులుగా ఉన్నారు. రెండో కుమారుడు విద్యాసాగర్ గాత్రంలో డిప్లమో చేసి పాడుతా తీయగా, స్వరాభిషేకం తదితర కార్యక్రమాలలో పాల్గొని ఆకాశవాణిలో శాస్త్రీయ లలిత, భక్తి సంగీత విభాగాలలో రాణిస్తున్నారు. స్వరసాగరం అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా సందేశాత్మక గీతాలు అందిస్తున్నారు. 8ఏళ్లుగా నూజివీడు ఐఐఐటీలో గాత్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. మూడో కుమారుడు వాసుదేవశర్మ వయోలిన్, గాత్రంలో డిప్లమో చేసి జంత్రగాత్ర విద్వాంసునిగా పేరుతెచ్చుకొని హరికథలు, శాస్త్రీయ నృత్యం కచేరిలకు వాయులీన సహకారం అందిస్తున్నారు. వీరిని ఇటీవలే మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు ప్రత్యేకంగా అభినందించారు.


బంకుపల్లి సోదరులను అభినందిస్తున్న ధర్మాన సోదరులు

దాతలే దిక్కు

- అనారోగ్యంతో మంచం పట్టిన డిగ్రీ విద్యార్థి
- లక్షలు ఖర్చయినా వ్యాధి నిర్ధారణ కాక అవస్థలు
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


చికిత్స పొందుతున్న కొండక చరణ్‌దీప్

నరసన్నపేట : ఎప్పుడు చలాకీగా ఉండే ఆ కుర్రాడు ఒక్కసారిగా డీలాపడిపోయాడు. 60 కేజీల బరువు నుంచి ఒక్కసారిగా 30 కేజీల బరువు తగ్గిపోయి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. నరసన్నపేటలోని కొత్తవీధికి చెందిన కొండక ఆదినారాయణ, శారద దంపతుల కుమారుడు కొండక చరణ్‌దీప్ స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. ఒక్కసారిగా బరువు తగ్గిపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై నరసన్నపేట, శ్రీకాకుళం, విశాఖలోని వైద్యులకు చూపించారు. ప్లేట్‌లెట్స్ పూర్తిగా పడిపోయాయి. వైద్యం చేయిస్తున్నా లక్షకు దాటడం లేదు. అసలు వ్యాధి ఏంటనేది వైద్యులు నిర్ధారణ చేయలేకపోయారు. ఇంట్లో ఉన్న కాస్త డబ్బుతో పాటు అప్పులు చేసి రూ.మూడు లక్షలకు పైగా వెచ్చించినా ఆరోగ్యం కుదుట పడలేదు. మరింతగా చరణ్ దీప్ ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం రాయవెల్లూరు వెళ్లాలని వైద్యులు సలహా ఇచ్చారు. లివర్ సమస్య లా ఉందని, బైయాప్సీ తీయిస్తే వ్యాధి తెలుస్తుందని చెప్పారు. అయితే అక్కడకు వెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో దాతలు సహాయాన్ని అర్థించారు. నరసన్నపేటకు చెందిన మార్పు విజయకుమార్ ఆధ్వర్యంలో దాతలు మంగళవారం రూ.1.85 లక్షలు వితరణ చేశారు. దీంతో చరణ్‌దీప్‌ను రాయవెల్లూరుకు కుటుంబ సభ్యులు తీసుకువెళ్తున్నారు. ఈ సందర్భంగా తండ్రి ఆదినారాయణ మాట్లాడుతూ తాను సాధారణ ఫొటోగ్రాఫర్‌గా జీవిస్తున్నానని, కుమారుడు ప్రాణాపాయ స్థితిలో ఉండటం ఆందోళనగా ఉందని చెప్పారు. వైద్య కోసం రూ. పది లక్షలపైగా ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని, దాతలు సహకరించి పుత్రభిక్ష పెట్టాలని వేడుకున్నారు. దాతలు 63091 13268 నంబర్‌కు సంప్రదించి సాయం చేయాలని చేయాలని కోరారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేయాలని ఆర్టీసీ పరిపాలనాధికారి పి.రాజు అన్నారు. ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ ఆధ్వర్యంలో మంగళవారం డిపో గ్యారేజీలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సంస్థ నమ్మకాన్ని పరిరక్షిస్తూ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ గతంలో ప్రభుత్వరంగ సంస్థగా ఉండేదని, ఇప్పుడు ప్రభుత్వంలో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం మార్చి, ఏప్రిల్ నెలల్లో అత్యధిక ఆదాయం, డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు, కండక్టర్లను సత్కరించారు. అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు ఎస్.వి.రమణ, డి.వి.రాజు, కె.ఎస్.రావులను, కండక్టర్లు పీఎస్ రావు, పి.వి.ఆర్.కుమార్, జీపీఆర్ గుప్తా, జీటీ బాబులను నగదు పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎల్ఎస్ నాయుడు, మెకానికల్ ఇన్‌చార్జి స్వామి, ఆఫీస్ సూపరింటెండెంట్ బి.దక్షిణామూర్తి, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉద్యోగిని సత్కరిస్తున్న దృశ్యం

రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు

- జిల్లా సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

రణస్థలం: రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభించామని జిల్లా సూక్ష్మ నీటిపారుదల పథకం ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం వ్యవసాయ కార్యాలయంలో గ్రామీణ ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 800 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పరికరాలు కావల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుకు ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో రణస్థలం ఏఓ డి.విజయభాస్కర్, ఉద్యాన అధికారి ఎం.అనూష, ఎంఐ ఇంజినీర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు

ఉపాధి అవకతవకలపై విచారణ

- అధికారులను అడ్డుకున్న టీడీపీ నాయకులు


అధికారులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్న అధికారులను టీడీపీ నాయకులు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మండలం మశాఖపురం గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అనపాన షర్మిళ మస్టర్లలో అవకతవకలకు పాల్పడిందని వేతనదారులు ఫిర్యాదు చేయగా ఎంపీడీఓ కె.రామారావు, ఏపీఓ పి.శ్రీనివాసులు మంగళవారం అదే గ్రామంలో విచారణ చేపట్టారు. సుమారుగా రెండు గంటల పాటు ఆమె రాకపోవడంతో అధికారులు వేతనదారులతో సమావేశం ప్రారంభించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అత్తయ్య అనపాన లోలాక్షి మార్చి 4న నెలరోజుల పాటు తీర్థయాత్రలకు వెళ్లినప్పటికీ మార్చి 6 నుంచి 3 వారాలపాటు పనిలోనికి వచ్చినట్లు మస్టర్లు వేసి వేతనం తీసుకున్నట్లు, పైల రత్నం పనికి వెళ్లకపోయినా మార్చి 6 నుంచి 3 వారాలు పనికి వచ్చినట్లు, గుడియా హేమ మే 22 నుంచి పనికి రాకపోయినా నాలుగు రోజులు పనికి వెళ్లినట్లు మస్టర్లు వేసినట్లు అధికారుల విచారణలో తేలింది. సమావేశం చివర్లో ఫీల్డ్ అసిస్టెంట్ షర్మిళ, సర్పంచ్ కూమారుడు ఆసి మాధవరావుతో పాటు మరికొంతమంది టీడీపీ నేతలు జోక్యం చేసుకోవడంతో విచారణ రసాభాసగా మారింది. తమ అనుమతి లేకుండా విచారణ ఎలా చేపడతారంటూ ఆందోళన చేపట్టారు. దీంతో అధికారులు విచారణను అర్ధాంతరంగా ముగించి వెనుదిరిగారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సింగుపురంలో రూ.26.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు చేసిన ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేయలేని పనులన్నీ ఈ ప్రభుత్వంలోనే రైతులకు చేయించినట్లు చెప్పారు. పరిపాలనను మరింత చేరువ చేస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే ఎరువులు అందేవని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో అందరికీ ఇంటి వద్దకే రైతు భరోసా కేంద్రం ద్వారా ఎరువులు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రూ.200 కోట్లు ఖర్చుచేసి గొట్టబ్యారేజ్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎత్తిపోతల పథకం పూర్తయితే మండు వేసవిలో కుడా మంచినీరు అందుతుందన్నారు. అంపోలులో వ్యవసాయదారులకు సంబంధించి ల్యాబ్ ఏర్పాటు చేసామన్నారు. ఉచితంగా కరెంట్ ఇవ్వలేమని ఆ రోజు చంద్రబాబు చెప్పారని, నేడు రైతులకు ఉచిత కరెంట్ అందిస్తున్న ప్రభుత్వం ఇదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురామ్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, గుండ మోహన్‌రావు, బగ్గు అప్పారావు, నక్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన వ్యాన్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌కు చెందిన డ్రైవర్ ఎస్.కె.ఫజిలినాథ్, క్లీనర్ షేక్‌రాజ్‌లు విశాఖపట్నం వైపు వ్యాన్‌తో వస్తుండగా కె.కొత్తూరు జాతీయ రహదారిపై ముందు వెలుతున్న లారీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీలో ఇరుక్కున్న ఇరువురిని స్థానికులు బయటకు తీసి హైవే అంబులెన్స్ సహాయంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- గేటు వేయలేదని గుర్తించి ఆగిన గూడ్స్ రైలు


నౌపడ వద్ద గూడ్స్‌రైలు

టెక్కలి రూరల్: విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు టెక్కలి మండలం నౌపడ ఆర్ఎస్ రైల్వే గేటు వద్ద పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గూడ్స్ రైలు విశాఖపట్నం నుంచి నౌపడా మీదుగా భువనేశ్వర్ వైపు వెళ్తుండగా ఆ సమాచారం తెలియని గేట్‌మ్యాన్ గేటు వెయలేదు. ఈ విషయాన్ని గుర్తించిన గూడ్స్ డ్రైవర్ రైలు వేగాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. హారన్ వేయడంతో అప్రమత్తమైన గేట్ మ్యాన్ హుటాహుటిన గేటు వేశారు. దీంతో రైలు అక్కడి నుంచి వెళ్లింది. గూడ్స్ డ్రైవర్ గుర్తించకపోతే పెనుప్రమాదం జరిగి ఉండేదని వాహనదారులు చెబుతున్నారు.

పాడి రైతులకు ఆసరాగా పశుబీమా


పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు

పాతపట్నం : వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వి. జయరాజ్ అన్నారు. పాతపట్నం మండలం బి.గోపాలపురంలో మంగళవారం వైఎస్సార్ పశుబీమా పథకంపై పాడి రైతులకు, గొర్రెలు, మేకల పెంపకందారులకు అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్ పశు బీమా పోస్టర్‌ను, కరపత్రాలను ఏడీ కరుణాకరరావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, సచివాలయ కన్వీనర్ టంకాల ఢిల్లేశ్వరరావు, సుబ్బారావు, వల్లభరావు, చంటి, నిరంజన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలన ఆదర్శప్రాయం'


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

టెక్కలి రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలన ఆదర్శప్రాయంగా కొనసాగుతోందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై మహాజన సంపర్క్ అభియాన్ జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో పేదలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. మోదీ ప్రధానిగా ఉంటే శత్రు దేశాలు మన వైపు చూడలేవని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ కన్వీనర్ అట్టాడ రవిబాబ్జీ, జిల్లా నాయకులు ఉమామహేశ్వరి, తిరుపతిరావు, బి.నరేంద్ర, రాంజీ తదితరులు పాల్గొన్నారు.